# నవ్వే కళ్లలో...?

## సిహెచ్ సుందరరామయ్య



ప్రతి మనిషికి నిత్యము జీవితంలో ఎన్నెన్నో సంఘటనలు ఎదురౌతూనే వుంటాయి. జీవనసరళి అనుకోని మలుపులు తిరగటానికి ఒక్కొక్కప్పుడు ఈ సంఘటనలే కారణం! అయితే జీవితంలో జరిగిన ప్రతి సంఘటన మంచికైనా దారి తీయవచ్చు! లేదా చెడుకైనా దారి తీయవచ్చు! అది ఆ వ్యక్తి యొక్క అదృష్ట దురదృష్టాల మీద ఆధారపడి వుంటుంది.

'జీవితంలో ఏంజరిగినా అంతా మన మంచికే అనుకొని ముందుకు సాగిపోవాలి!' అని మన శ్రేయోభిలాషులు ఓదార్చడానికి చెప్పే మాటలను ఒకప్పుడు నేను హాస్యాస్పదంగా తీసుకొనేవాణ్ణి! అది కేవలం మనిషికి ధైర్యాన్ని కల్పించేందుకు బోధించే హిత వచనాలని రేపటి రోజు మీద ఆశ కల్పించటానికి ఆడే నాటకమని, పరిహాసం చేసేవాణ్ణి! ఏదైనా తన దాకా వస్తే కాని తెలియదంటారు... ఆనాటి అభిప్రాయాన్ని మార్చుకొని నా అజ్ఞానానికి సిగ్గుపడాల్సిన పరిస్థితి నా జీవితంలో ఇంత త్వరగా వస్తుందనుకోలేదు. ఇందుక్కారణం ఆరోజు జరిగిన సంఘటన! ఆ సంఘటనే జరక్కుండా వుంటే నా జీవన బాటలో ... ఎన్ని బాధల అగాధాలు ఏర్పడి వుండేవో? ఓ అమాయకురాలి గుండెలో ఎన్ని కన్నీటి 'లావా'లు విరజిమ్మి వుండేవో...?

* * *

నేను, మధు వాల్తేర్ స్టేషన్లోకి అడుగు పెట్టేసరికి ప్లాట్‌ఫామ్మీద గోదావరి ఎక్స్‌ప్రెస్ సిద్ధంగా వుంది.

ఇద్దరం రిజర్వేషన్ బోర్డు దగ్గరకు వెళ్లాం.

పర్సులోంచి టిక్కెట్టు తీసి చార్ట్‌లో బోగీ నంబరు కోసం వెదికాడు మధు.

ఇద్దరం కల్సి బోగీ దగ్గరకు వెళ్లాం.

లగేజీని తన బెర్తు మీద వుంచి మధు ప్లాట్‌ఫామ్మీదికి వచ్చాడు.

'ఆనంద్ నేను పదేపదే చెప్తున్నానని అనుకోవద్దు! మరోసారి నేను చెప్పిన విషయం ఆలోచించు!' అంటూ సూటిగా నా కళ్లలోకి చూశాడు మధు.

నేను సూటిగా అతని ముఖంలోకి చూడలేక పోయాను. అతనికి సమాధానంగా తలవూపాను.

'వైజాగ్‌లో సెమినార్ ఏర్పాటు చేశారని తెలియగానే నేనెంతో సంతోషించాను. ఎందుకో తెలుసా? నిన్ను చూడటమే కాకుండా నీ మనసు మార్చటానికి నాకో చిన్న అవకాశం దొరికినందుకు...'

నేను మాట్లాడలేదు.

'అయామ్ రియల్లీ సర్‌ప్రయిజ్డ్...! ఇలాంటి పరిస్థితిని నీవు చేతులార తెచ్చుకొంటావని నేను కలలో కూడా వూహించలేదు.'

నీవే కాదు! నేను కూడా వూహించలేదు— అనాలనుకొన్నాను. కాని గొంతుపెగిలి మాటలు రాలేదు.

'ఇంత చెప్పినా నీ మనసు మారలేదా ఆనంద్? కరుణ అనేది నీ మనసులో రవ్వంత కూడా లేదా?'

మధు అడిగిన ప్రశ్నకు నోరు విప్పి సమాధానం చెప్పే స్థితిలో నేను లేను.

అందుక్కారణం నా గుండె కరడుకట్టుకు పోవడమే! ఏనాడైతే అన్నపూర్ణ నా ఇంట్లోంచి బయటకు వెళ్లిందో ఆనాడే నా హృదయంలో కరుణ, జాలి, ప్రేమ అనే మంచి గుణాలన్నీ మటుమాయమయ్యాయి. కఠిన పాషాణంగా మారిపోయింది నా హృదయం.

'నెనలా వెళ్లి సిగరెట్లు తెచ్చుకొంటాను!' అని క్యాంటీన్ వైపు నడిచాడు మధు.

ప్లాట్‌ఫాంమీద హడావుడిగా తిరుగుతున్న జనంవైపు దృష్టి సారించిన నాకు హఠాత్తుగా ఓ దృశ్యం కన్పించింది. మధు కోచ్ వెనుక ప్రక్కనున్న కోచ్ డోర్ దగ్గర నిల్చున్న అమ్మాయిని చూడగానే నిశ్చేష్టుడనయ్యాను. ఆ అందాల రాశిని చూడటానికి నా రెండు కళ్లు చాలవన్పించింది.

బంగారు వన్నెలో మెరుస్తున్న ఆమె శరీరానికి క్రీమ్ కలర్ పాలిస్టర్ శారీ, అదే రంగు మాచింగ్ బ్లవుజ్ మరింత శోభను చేకూర్చాయి.

ఆహర్నిశలు శ్రమించి అత్యంత

రమణీయంగా ఓ రస హృదయుడైన శిల్పి తీర్చి, దిద్దుకొన్న శిల్పంలా వుంది ఆమె.

ఆమె నిలబడిన తీరులో వయ్యారం వుంది.

ఆమె అవయవ పొందికలో సింగారం వుంది.

ఆమె నేత్రాలు ఎనలేని కాంతులను విరజిమ్ముతున్నాయి. ఆ కాంతి కిరణాలు వెన్నలా మృదువుగా, వెన్నెల్లా చల్లగా నా హృదయాన్ని తాకాయి.

ఏదో మంత్రశక్తి నా మనసును వశపర్చుకొన్నట్లయింది.

నేను చూపులను మరల్చుకోలేకపోయాను.

ఆమెను అలానే కన్నార్పకుండా చూడాలనే కాంక్ష నా మనసులో నాటుకుపోయింది.

సభ్యత, సంస్కారాలను ఆ క్షణంలో మర్చిపోయాను.

ఆమె కంపార్ట్‌మెంట్లోంచి క్రిందికి దిగి ప్లాట్‌ఫామ్మీద నిలబడింది. ఆమె చుట్టూ అయిదుగురు వ్యక్తులు గుమిగూడారు. అందులో ఒకరు నడివయసులో వున్న స్త్రీ మరొకరు పదేళ్ల అమ్మాయి. మిగిలిన ముగ్గురు ముప్పయ్‌లోపే వయసున్న యువకులు. వాళ్లంతా ఆమెకు సెండాఫ్ యివ్వటానికి వచ్చినట్లున్నారు. వాళ్లతో ఆమె నవ్వుతూ ఎంతో ఉత్సాహంగా మాట్లాడుతోంది. పెదాలమీద చిఱునవ్వు చిఱుచిందులు వేస్తుంటే అందుకు అనుగుణంగా ఆమె కళ్లు అభినయం చేస్తున్నాయి.

పున్నమి వెన్నెలను కురిపించే ఆ చిఱునవ్వు పిచ్చివాణ్ణి చేయసాగింది.

ఆమె పెదాలు నవ్వుతున్నాయా లేక, ఆమె కళ్లే నవ్వుతున్నాయా అనే అనుమానం నాకు కల్గింది.

నేనే భావకవినై వుంటే ఆ క్షణంలో ధారావాహికగా నా గళంనుండి కమనీయ కవితలెన్నో వెలువడివుండేవి! నేనే శిల్పినై వుంటే ఓ సుందర రూపాన్ని కఠినశిలలో నుండి వెలికి తీసి వుండేవాణ్ణి!

నేనే చిత్రకారుణ్ణై వుంటే నా చేతిలోని కుంచె ఓ సౌందర్యదేవతకు ప్రాణప్రతిష్ఠ చేసి వుండేది!

కాని సామాన్య మానవుణ్ణి నేను!

పాషాణమనుకొన్న నా హృదయం ఆమె చిఱునవ్వుల జడివానలో పునీతమై కరిగిపోతున్నట్లనిపించింది.

ఆమె చుట్టూవున్న వ్యక్తులు ఇంగ్లీషులోను, మధ్య మధ్య హిందీలోను మాట్లాడుతూ ఆమెను నవ్విస్తున్నారు. ఆమె విరగబడి నవ్వుతూంది. ఆ నవ్వుల పువ్వులు నా హృదయాన్ని మృదువుగా తాకుతున్నాయి. ఏదో అవ్యక్తమైన పులకింత, అందీ అందని అనుభూతి హృదయంలో కల్గాయి.

విశాలమైన ఆమె నేత్రద్వయం అందంగా

# నవ్వేకళ్లలో...?

అభినయం చేస్తుంటే నా మనసులో ఎన్నెన్నో భావనలు...

ఆమె నాకు అభిముఖంగా నిలబడి మాట్లాడటంచేత ఆమె హావభావాల అందాలను, చూపుల సోయగాలను మనసార తిలకించ కల్గుతున్నాను.

మౌనంగావున్నా ఆమె కళ్లు నవ్వుతున్నట్లే కన్పించాయి.

ఆ కళ్లలో అంత కాంతి ఎలా గూడుకట్టుకొందో? చిరుగాలికి నుదుటిమీద ఎగురుతున్న ముంగురులను సుతారంగా సవరించినప్పుడు, మెడలోని ఒంటిపేట గొలుసుకున్న లాకెట్‌ను పెదాలమధ్య సుకుమారంగా తాకించినప్పుడు ఆమె అందం మరింత ద్విగుణీకృతం అవుతున్నట్లనిపించింది. కొంచెం ముందుకెళ్లాను.

ఆమె ఎక్కిన కంపార్ట్‌మెంట్‌కు అంటించిన రిజర్వేషన్ చార్ట్‌ను చూశాను ఆమె పేరును తెల్సుకోవాలనే ఆశతో. ఆ చార్ట్‌లో ఆడపేర్లు మూడున్నాయి.

కమల, జానికి, సౌందర్య...

దగ్గరగా వెళ్లాను కనుక ఆమెను పరిశీలనగా చూశాను.

తప్పకుండా ఆమె పేరు 'సౌందర్య' అయి వుంటుంది. ఎంత అందమైన కనులవి!

కవి కలానికి భావుకతను ఆపాదించే కనులవి!

శిల్పి ఉలికి నవచైతన్యాన్ని కల్గించే నయనాలవి! గాయకుని గళానికి గమకాలను ప్రసాదించే నేత్రాలవి! ఆ కన్నుల గారడీలో నేను చిక్కుకుపోయాను.

ఆమె పెదాలమీద దరహాస చంద్రికలు వెల్లివిరుస్తుంటే కనుబొమలు చిత్రాతిచిత్రంగా ముడివడుతున్నాయి. అదే సమయంలో సంపెంగలాంటి నాశిక గమ్మత్తుగా చిట్లించినట్లవుతుంది.

ఆ కమనీయ దృశ్యం వైపు కళ్లప్పగించి చూస్తూండిపోయాను.

మధు వచ్చి భుజమ్మీద చేయి వేసేసరికి ఉలిక్కిపడ్డాను, కొంచెం సిగ్గుపడ్డాను కూడా!

గార్డు విజిల్ వేస్తున్నాడు.

ప్లాట్‌ఫామ్మీదున్నవాళ్లు, ట్రయిన్‌లో వున్నవాళ్లు కంగారుపడుతున్నారు.

నాతో కరచాలనం చేసి ట్రయినెక్కాడు మధు.

ట్రయిన్ మెల్లగా కదిలింది.

ట్రయిన్ లోపల, ప్లాట్‌ఫామ్మీద ఎన్నో చేతులు గాల్లోకి లేచాయి శుభ సంకేతాలను సూచిస్తూ— మరెన్నో నవ్వులు అభిమానపు పువ్వులై స్టేషన్ నిండా విరిశాయి.

'ఐ వాంట్ ఎ ఫేవరబుల్ రిప్లయ్ ఫ్రమ్ యు ఫ్రండ్!' కంపార్ట్‌మెంట్లోంచి నన్ను ఉద్దేశించి అన్నాడు మధు.

సమాధానంగా తల ఊపాను.

డోర్ దగ్గర నిలబడి నవ్వుతూ చేతులూపుతున్న సౌందర్యను చూసి నేను కూడా నవ్వుతూ 'ఆల్ ది బెస్ట్' అనబోయాను.

ఆ మాటలయితే నా గొంతు దాటి బయటకు రాలేదు కాని నా చేయి మాత్రం ఆమె కనుమరుగయ్యేవరకు గ్రీట్ చేస్తూనే వుండిపోయింది.

* * *

'సౌందర్య' నాకు అనుక్షణం గుర్తుకు వస్తూనే వుంది. అందులో ఒంటరిగా వున్నానేమో నా మస్తిష్కంలో రకరకాల ఆలోచనలు చెలరేగుతుండేవి. సౌందర్య కళ్లు కలల్లో నన్ను కవ్వించేవి. ఎంత మర్చిపోదామన్నా మరువలేని అందాల నేత్రాలవి! ఆ కళ్లల్లోకి అలానే చూస్తూ జీవితాన్ని గడిపే అదృష్టం ఎవరిదో? ఆమెకు పెళ్లయిందో? లేదో? ఆమెను భార్యగా పొందినవాడు నిజంగా ఎంతో అదృష్టవంతుడు.

అదృష్టవంతుడంటే గుర్తుకు వచ్చింది నా పెళ్లిలో కూడా బామ్మ ఇలానే అంది.

'అదృష్టవంతుడువురా! సీతాదేవిలాంటి భార్య దొరికింది!' ఆ కాంప్లిమెంట్ అన్నపూర్ణకు.

ప్రక్కనే వున్న లక్ష్మి అందుకొంది 'ఏమండోయ్ బామ్మగారూ! మా అక్కను సీతాదేవిని చేశారు. కొంపతీసి బావను, అక్కను వనవాసం పంపరు కదా! పంపితే పంపారు. మా అక్కను ఏ రావణాసురుడు ఎత్తుకుపోకూడదని, అక్కకు, బావకు ఎడబాటు

## చెమటబొట్టు విశ్వరూపం


కపిలబావి నీళ్ళుతాగి
కళ్ళు తెరచిన 'వడ్లగింజ'—

మిల్లునుంచి ఎగిరొచ్చి
శరీరంమీద వాలిన 'బట్ట'—

కన్నీళ్ళతో మొలిచిన
కంకరరాళ్ళనుంచి
నవ్వుతూ నాగరికత చాటే 'రహదారి'—

శ్రమనీ సేవనీ
తీగలుగ సాగదీసి
వెలుతుర్ని పిండే 'వీధిదీపము'—
ఇవన్నీ...
శ్రమశక్తిని చీల్చుకుపుట్టే
ప్రతి చెమట బొట్టుకు
సజీవ సాక్ష్యాలు
తరాల
మానవ వారసత్వ పరంపరమీద
వ్యాపించిన
ఒక
విప్లవ విభాత సంకేతాలు —

— కలికిరి వి. అబ్దుల్ ఖాదర్.




కల్గకూడదని ఆశీర్వదించండి!' బామ్మ మనసులో ఏమని ఆశీర్వదించిందో నాకు తెలీదు. కాని నిజానికి జరిగిందేమిటి ?

వరాలు కోరుకొనే కైకేయి కాని, వరాలిచ్చే దశరథుడు కాని లేకపోయినప్పటికీ నాకు అన్నపూర్ణకు ఎడబాటు కల్గింది.

అందుక్కారణం నా అవివేకమే !

అనూకు ఏం తక్కువ ? బి. ఎ. చదివింది. అందం వుంది. గుణం వుంది. చక్కని సంస్కారం వుంది. సంసారాన్ని చక్కగా తీర్చిదిద్దుకోగల తెలివితేటలున్నాయి. అన్నిటికి మించి నన్ను ప్రేమించకల్గే హృదయం వుంది.

కాని... కాని...

ఆమెవలన జరిగింది ఒకే ఒక తప్పు...

అందుకే ఎడబాటు ఆమె పాలిట శిక్షగా మారింది. ఈ తీర్పు యిచ్చింది నేనే !

అయితే ఇది సమంజసమేనా ?

నా తీర్పుమీద నాకు నమ్మకం వుంది. కాని మధు నా తీర్పును తీవ్రంగా ఖండించాడు.

'అనూకు అలాంటి శిక్ష విధించే అధికారం నీకెవరిచ్చారు ? ఇంతకూ ఆమె చేసిన తప్పేమిటి? దొంగతనం చేసిందా ? వ్యభిచారం చేసిందా ? హత్య చేసిందా ? పెళ్లయి పది నెలలు కాకముందే భర్త వదిలేశాడంటే ఆమెకు ఈ సంఘంలో ఏమాత్రం గౌరవముంటుంది ? ఆమె నెందుకిలా అవమానిస్తున్నావ్ !' అని వాదించాడు మధు.

కాని ఆ వాదనకు నా మనసు మారలేదు. ఏదో గొప్ప అపరాధాన్ని అనూ చేసిందన్న అభిప్రాయం నా మనసులో స్థిరంగా నాటుకు పోయింది. ఆ అభిప్రాయం మారాలంటే మరో బలమైన సంఘటన జరిగితీరాలి...

నిజమే... అదృష్టవశాత్తు మరికొద్ది నెలలకే ఆ సంఘటన జరిగింది.

మధు వ్రాసిన వుత్తరం చదివి వెంటనే హైద్రాబాద్ బయల్దేరాను. నేను వెళ్లేసరికి మధు ఇంట్లో లేడు. మధు భార్య సుధ డాక్టర్. గవర్నమెంట్ డాక్టర్‌గా కొంతకాలం పనిచేసి ఆ తర్వాత రిజైన్ చేసి నర్సింగ్‌హోం కట్టించింది. నర్సింగ్‌హోమ్ మేడమీదే వాళ్ల నివాసం.

ప్రయాణ బడలికచేత భోజనం చేయగానే నిద్రపట్టింది. నిద్ర లేచేసరికి నాల్గు దాటింది.

అప్పటికీ మధు రాలేదు. నేను వచ్చినట్లు ఫోన్ చేశానని ఆరు గంటలకల్లా వచ్చేస్తారని సుధ చెప్పింది.

నాకు కాఫీ, టిఫిన్ ఏర్పాటుచేసి సుధ నర్సింగ్‌హోమ్‌కు వెళ్లిపోయింది.

మేడమీద వరండాలో కూర్చుని రోడ్డు మీదికి చూస్తూ కొంతసేపు గడిపాను.

ఆరు గంటలకల్లా మధు వచ్చేశాడు

స్నానాదులు ముగించుకొని కాఫీ త్రాగి నా ముందున్న కుర్చీలో కూర్చుని సిగరెట్ ముట్టించి అడిగాడు మధు.

'ప్రయాణం బాగా జరిగిందా ?' అని.

'రిజర్వేషన్ దొరకలేదు. ఓ సీటు సంపాదించుకుని రాత్రంతా అలానే కూర్చుండి ప్రయాణం చేయాల్సి వచ్చింది' అన్నాను.

'అయామ్ సారి ! వెంటనే రమ్మని ఉత్తరం వ్రాసి నిన్ను ఇబ్బంది పెట్టాను. కాని ఆనంద్ ! నిన్ను పిలిపించటానికి ఓ కారణం వుంది. నేను వైజాగ్ నుంచి వచ్చినప్పట్నుంచీ ఏరోజు కారోజు నీ దగ్గర్నుంచి వుత్తరం వస్తుందనీ ఎదురు చూశాను. కాని నీవు మనసు మార్చుకోలేదు. నీ వ్యవహారం ఇలా వదిలేస్తే లాభం లేదని వారం రోజుల క్రితం నేను, సుధ మీ మామగారింటికి వెళ్లాం. అనూను కల్సుకొని సుధ అన్ని విషయాలు మాట్లాడింది. ఆ పిల్ల నిజంగా అమాయికురాలు ! ఆమెకు ఏ పాపము తెలీదు...'

'నో... నేనొప్పుకోను ! అంతా తెలిసే నాటకమాడింది. భార్యా భర్తలమధ్య ఎటువంటి రహస్యాలు వుండకూడదు అన్న విషయం తెల్సి కూడా ఆ సంగతిని రహస్యంగా వుంచిందంటే ఆ మనిషిమీద నాకు విరక్తి కల్గదా ?' ఆవేశంగా అన్నాను.

'మిస్టర్ ఆనంద్! ఆవేశపడకు! శాంతంగా ఆలోచించు. అధికారంవున్న భర్తగాకాక మానవత్వమున్న మనిషిగా ఆలోచించు ! ప్రతి మనిషి ఆరోగ్యంగా వుంటే మనకింతమంది డాక్టర్లు, హాస్పిటల్స్ అనవసరం. మనం తినే కల్తీ ఆహారంవలన ఎన్నో వ్యాధులకు మనం గురవుతున్నాం. అనారోగ్యం కారణాన అయినవారిని ఎవరైనా వదులుకొంటారా ? రేపు సపోజ్ నువ్వే వ్యాధిగ్రస్తుడవయ్యావనుకో ! మేమంతా నిన్ను వదిలివేస్తామా ?...'

'పెళ్లయ్యాక భార్యాభర్తల్లో ఎవరు అనారోగ్యంతో బాధపడినా ఒకరి కొకరు సహాయం చేసుకోవాలి. కాదనను ! కాని నేను అసహ్యించుకొనేది ఆమె అనారోగ్యాన్నికాదు ! శరీరంలో దాగున్న వ్యాధిని బయటపెట్టని ఆమె మోసపు వృత్తిని! ఒకరకంగా అన్నపూర్ణను నేను ప్రేమించి పెళ్లిచేసుకొన్నట్లే ! ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో ఓ స్టాల్‌వద్ద ఆమెతో నాకు మొదటిసారిగా పరిచయం కల్గింది. మొదటి చూపులోనే ఆమె నన్ను ఆకర్షించటంచేత ఆమె వివరాలు తెల్సుకుని ఆమె తల్లిదండ్రులతో సంప్రదించి ఆమెను వివాహం చేసుకొన్నాను. పెళ్లికిముందు మా ఇద్దరికీ కొన్ని నెలలపాటు పరిచయం వుందికదా ! మరి తనకు ఫిట్స్ వస్తాయన్న భయంకర సత్యాన్ని నాకెందుకు చెప్పలేదు ? పెళ్లికాకముందే ఆమె నిజంచెప్పి వున్నట్లయితే నేడీ పరిస్థితి కల్గేది కాదుగా !...'

'చూడు ఆనంద్ ! ప్రస్తుతం మన వ్యవస్థలో ఆడపిల్లల వివాహం ఎంత దారుణ సమస్యగా తయారైందో నీకు తెల్సు ! ఎలాగోలా ఆడపిల్లకు పెళ్లిచేయాలని ప్రతి తండ్రి ప్రయత్నిస్తాడు. అమ్మాయి అందంగా వున్నంత మాత్రాన కట్నంలేకుండా పెళ్లిచేసుకొనే ఉదార స్వభావులు ఈ కాలంలో ఎంతమంది వున్నారు ? అందమైన ఆడపిల్లలకే వివాహ సమస్య కష్టమైనపుడు మరి అందంగాలేని వాళ్లసంగతి, అంగవైకల్యం వున్నవాళ్ల సంగతేమిటి ? ఎవరి బిడ్డ వారికి ముద్దు. ఎన్ని లోపాలున్నా ఒక్కోసారి గుప్తంగా వుంచి ఆ మూడు ముళ్లు పడేట్లు

చూస్తారు తల్లిదండ్రులు. మా అమ్మాయిలో ఫలానా అవకరం వుందని ఏ కన్నతండ్రి బహిరంగంగా చెప్పుకోడు!

అలా చెప్పుకొనే రోజు ఎప్పుడొస్తుందో తెలుసా? విశాల హృదయంతో పరిస్థితులను అర్థం చేసుకొని ఆడవాళ్లను ఆదుకొనే ఆదర్శమూర్తులు అవతరించిననాడు! అప్పటివరకు వెయ్యి అబద్దాలయినా చెప్పి ఓ పెళ్లి చేయాలి. ఇంకో విషయం! ఎబార్షన్స్ చేయించి గుట్టుగా పెళ్లిళ్లు జరిపిస్తున్నారు కదా కొంతరు! వాళ్లతో పోల్చిచూస్తే అన్నపూర్ణ చేసిన తప్పు ఏపాటిది? పైగా ఫిట్స్ రావటమనేది మనిషి యొక్క మానసిక పరిస్థితిమీద ఆధారపడి వుంటుంది. చిన్నప్పుడే ఆర్థిక దుస్థితికి గురికావటం, తనకు పెళ్లికాకపోవటం, తన వెనుక మరో నల్గురు ఆడపిల్లలు వుండటం, మరో కొద్ది సంవత్సరాలల్లో తండ్రి రిటైర్ కావటం వగైరా సమస్యలు ఆమె మనసులో ఎప్పుడూ మెదుల్తుండేవి. అదృష్టవశాత్తు నీవామెను ఆదుకొని వివాహం చేసుకోవటంతో ఓ సమస్య పరిష్కారమైంది. మిగిలిన సమస్యల ఒత్తిడికి ఆమె తట్టుకోలేకపోయింది.

నీకు తెలీని నిజం యింకొకటి వుంది. నీవనుకొన్నట్లు పెళ్ళికి ముందు అన్నపూర్ణకు ఫిట్స్ ఎప్పుడూ రాలేదట. మీ పెళ్లయిన రెండు నెలలకు ఆమెకు మొట్టమొదటిసారిగా ఫిట్స్ వచ్చాయి. కాని నీవు నమ్మటంలేదు. అంతకు మునుపే ఆమెకా జబ్బు వుందని, ఆ రహస్యం నీకు చెప్పకుండా మోసగించి వివాహం చేసుకొందని ఒకానొక దురభిప్రాయాన్ని నీ మనసులో ఏర్పరచుకొన్నావు ...'

మధు మాటలు వింటుంటే నా కంతా అయోమయంగా తోచింది.

'నీవు చెప్పేది నిజమేనా మధూ?' అని అడిగాను.

'నిజమే ఆనంద్! ఇందుకు సాక్ష్యం డాక్టర్ సుధ! పద ఆవిణ్ణే అడుగు!' అంటూ లేచాడు మధు.

ఇద్దరం మేడదిగాం.

క్రింద నర్సింగ్‌హోమ్ పేషెంట్స్‌తో బిజీగా వుంది. ఆ సమయంలో డాక్టర్ సుధను డిస్టర్బ్ చేయటం భావ్యం కాదని అలా టాంక్ బండ్‌వరకు వెళ్దామని మధుతో అన్నాను.

బయటకు వెళ్తున్నట్లు సుధకు చెప్పి వస్తానని మధు కన్సల్టింగ్ రూమ్‌కు వెళ్లాడు.

నేను మెల్లగా అడుగులు వేసుకుంటూ నడిచాను. గేటు దగ్గరకు రాగానే ఠక్కున ఆగిపోయాను.

ఎదురుగా సౌందర్య!

ఆశ్చర్యపోయాను.

అందమైన ఆ కళ్లను చూసే అదృష్టం మళ్లీ నాకు లభించినందుకు ఎంతో ఆనందించాను.

లోగడకంటె మరింత అందంగా వున్నాయి ఆ కళ్లు. ఆమె సరాసరి కన్సల్టింగ్ రూమ్ వైపు నడిచింది. అప్పుడే బయటకు వస్తున్న మధు ఆమెకు ఎదురు పడ్డాడు.

ఆమె అతనికి విష్ చేసింది. మధు ఆమెను ఏమిటో అడిగినట్లున్నాడు, ఆమె రోడ్డువైపు చూపించి ఏదో చెప్తూంది.

కనపడినంతసేపు నేనలా ఆమె వైపు చూస్తూండిపోయాను.

మధు కారు దగ్గరకు వచ్చి స్టార్ట్‌చేసి నా దగ్గరకు వచ్చి ఆపాడు.

నేను కారెక్కాను.

కారు మెల్లగా కాంపౌండ్ దాటి రోడ్డు మీదికి వచ్చింది.

'వన్‌మినిట్' అంటూ కారును ఆపి మధు దిగాడు.

అతను వెళ్లిన దిక్కే చూశాను.

రోడ్డు ప్రక్కగా పార్క్ చేయబడిన ఓ కారు వద్దకు వెళ్లి అందులో వున్న ఓ కళ్లద్దాల వ్యక్తిని పల్కరించి వచ్చాడు.

సౌందర్య ఆ కార్లోంచి దిగి వుంటుందని, ఆమెకు అందులో కూర్చున్న వ్యక్తికి ఏదో సంబంధం వుండి వుంటుందని వూహించకల్గాను కాని సౌందర్య గురించి వివరాలు తెల్సుకోవాలన్న తహతహ నాలో అధికమైంది. కాని విషయం ఎలా కదపాలా అని ఆలోచిస్తున్న నాకు మధు దారి చూపించాడు.

'ఆనంద్! కార్లోంచి దిగి లోపలికి వచ్చిన అమ్మాయిని చూశావా?' అని అడిగాడు.

'ఆం...' అన్నాను ఉలిక్కిపడుతూ.

'ఆమె పేరు...'

'సౌందర్య అయివుంటుంది...'

'వాట్ ఎ సర్‌ప్రయిజ్! ఆమె నీకు తెలుసా?' ఠక్కున ఆశ్చర్యంగా అడిగాడు మధు.

'ఆమె అందంగా వుంది కనుక ఆమె పేరు అదే అయివుంటుందనుకొన్నాను. ఆమెవరో నాకు తెలీదు!' అన్నాను.

'నిజమే ఆనంద్! శారీరకమైన అందాన్ని గుర్తించటానికి కళ్లుంటే చాలు! కాని మానసికమైన అందాన్ని గుర్తించటమే కొంచెం కష్టం!'

కారు రోడ్డుమీద మెల్లగా సాగిపోతూంది.

మధు మళ్ళీ అన్నాడు.

'సౌందర్య అందం కేవలం బాహ్యమైన దేనని, ఆమె మనసు శరీరమంత అందమైనది కాదని నీ వనుకుంటున్నావని నాకు తెల్సు! నువ్వే కాదు! ఆమెను చూచిన ప్రతివారు అలా అనుమానించడం సహజం! మొదట్లో నేను కూడా అలానే అనుకున్నాను. కాని సుధ ద్వారా సౌందర్య వివరాలు తెల్సుకొని ఆశ్చర్యపోయాను. ఆమె మనషుల్లో దేవత అన్పించింది. చేయెత్తి దణ్ణం పెట్టాలనిపిస్తుంది నాకు. త్యాగం చేయటంలో ఆడవాళ్లదే పైచేయి అని ఋజువు చేసిందా అమ్మాయి!...'

'ఆమె చేసిన త్యాగం అంత గొప్పదా?' నా ప్రశ్నలో ఎగతాళి ధ్వనించింది.

'గొప్పదో కాదో నువ్వే చెబుదువు కాని' అంటూ కారును టాంక్ బండ్‌మీద ఆపాడు మధు.

ఇద్దరం కారు దిగి ఓ సిమెంటు బెంచీ దగ్గరకు వెళ్లి కూర్చున్నాం.

హుస్సేన్‌సాగర్ మీదుగా ప్రయాణం చేసి వచ్చిన పిల్ల వాయువులు చల్లగా శరీరాన్ని తాకి మనసుకు ఆహ్లాదాన్ని కల్గిస్తున్నాయి.

సిగరెట్ వెల్గించి పొగబయటకు వూదుతూ అన్నాడు.

'ఆలోచిస్తుంటే నువ్వు, సౌందర్య నార్త్ పోల్, సౌత్ పోల్ అన్పిస్తుంది నాకు ...'

'అంటే నీ వుద్దేశం నేనుస్వార్థపరుణ్ణనేగా!'


'అదికాదు నా వుద్దేశం! మీ యిద్దరికి క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయి. అయితే ఆమె తీసుకొన్న నిర్ణయం ఎంత ఉదాత్తమైనదో నీవు తీసుకొన్న నిర్ణయం అంత కఠోరమైనది..'

సౌందర్యకు కిష్టపరిస్థితి ఎదురైందా? నమ్మలేకపోయాను.

'అదృష్టాన్ని దురదృష్టం, వెలుగును చీకటి ఎప్పుడూ అంటిపెట్టుకొనే వుంటాయి. సౌందర్యది ప్రేమ వివాహం. ఆమె సురేష్ అనే నేవల్ ఆఫీసర్‌ను ప్రేమించింది. పెద్దల

## ట్రిమ్మింగ్ - 130

ఆటల్లో పాల్గొనటాన్ని ప్రారంభించటం ఎన్నడూ ఆలస్యంకాదు అని పశ్చిమ జర్మనీలో హీడిల్‌బర్గ్ విశ్వవిద్యాలయం లోని క్రీడాశాఖ అధిపతి ప్రొ. హోక్సెబర్ స్పాషర్ అన్నారు. ఇటీవల మ్యూనిచ్ నగరంలో జరిగిన అంతర్జాతీయ క్రీడా పరికరాల ప్రదర్శన, ఇస్పో—83 ను ప్రారంభోత్సం కావిస్తూ పై విధంగా అన్నారు. పశ్చిమ జర్మనీలో 61 శాతం ప్రజలు వివిధ రకాల ఆటల్లో పాల్గొంటున్నారని ఆయన తెలియజేశారు. పశ్చిమ జర్మనీ క్రీడా సంఘం ఇటీవల "ట్రిమ్మింగ్—130" అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. పరుగెత్తటం, ఈత, సైకిలు తొక్కటంవంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. వృద్ధులు కూడా శక్తికి మించక వీధిల్లో పాల్గొనవచ్చునని ఆయన అన్నారు. దీనివలన రక్తపీడనం స్థిరంగా 130 వద్ద ఉండగలదని ఆయన అన్నారు.



# డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

### పి.ఆర్.ఆర్. — వెల్లూరు

నా వయస్సు 27 సం॥లు. ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను. పుష్పవతి అయినప్పటినుంచి, మెన్సెస్ టైములో కడుపు నెప్పి, నడుంనెప్పి, కాళ్ళ నెప్పితో బాధపడుతున్నాను. బ్లీడింగ్ వారం రోజులు ఉంటుంది. కడుపునెప్పి, బ్లీడింగ్ తగ్గాలంటే ఏ మందులు వాడాలి ?

★ లేడీ డాక్టర్లచేత పరీక్షింప చేసుకుని, రోగ నిర్ధారణ చేసుకోవటం అవసరం. మెనొరేజియా, మెట్రోపొతియా, హెమొరాజికా అనే రోగాలు హార్మోనుల అవకతవకలవల్ల ఏర్పడతాయి. ఇవి ఉన్నదీ లేనిదీ పరీక్షించి మందులు వాడవలసి ఉంటుంది.

### పి. వి. — భీమవరం

నా వయస్సు 18 సం॥లు. బహిస్టు అయిన 7వ రోజు తర్వాత 15 రోజుల వరకు తెలుపు అవుతుంది. మళ్ళీ బహిస్టు అయ్యే 7 రోజుల ముందునుంచి అవదు. దీనివలన సంసార జీవితానికి ఏమైనా చెడా ?

★ పై లక్షణాలు చాలామటుకు ప్రకృతి సిద్ధమే. దీనికీ, సాంసారిక జీవితానికీ సంబంధం లేదు.

### పి. ఎ. కె. — గంద్రాయి

నా వయస్సు 15 సం॥లు. నేను పుష్పవతిని అయి 2 సం'లు. నెల నెలా బహిస్టు రావటం లేదు. 4 నెలలకి, 3 నెలలకి, ఒక్కోసారి 6 నెలలకి వస్తుంది. క్రమంగా బహిస్టు రావాలంటే ఏం చేయాలి ?

★ మీరు ఏ మందులూ వాడనవసరంలేదు. పుష్పవతులైన తర్వాత కొన్ని నెలలపాటు ఇలా ఆలస్యంగా రావటం సహజమే. దానిని గురించిన ఆందోళన మరింత ఆలస్యానికి కారణం ఆయ్యే అవకాశం ఉంది.

### ఎస్. ఎన్. డి. — అమలాపురం

మా నాన్నగారి వయస్సు 45 సం. లు. కొంతకాలంగా పడుకునేటప్పుడు రెండు కాంపోజ్ మాత్రలు వేసుకోవటం అలవాటయింది. అలా వేసుకోవటం వల్ల ప్రమాదమా ?

★ ఏ మందులైనా వాడగా వాడగా శరీరానికి ఏదో విధమైన హాని కలుగజేయకుండా ఉండవు. వాటివల్ల రాగల అవాంతరాలు కొన్ని మాత్రమే ప్రస్తుతం మనకు తెలుసు. చాలా మటుకు తెలియవు. సూక్ష్మంగా జరిగే మార్పులు చాలా ఉంటాయి. ప్రస్తుతం మనకు తెలిసిందల్లా కొన్నిరకాల మందులు చాలాకాలం వాడినా పెద్ద హాని కలుగజేయవని మాత్రమే !

### ఎం. వి. — బొంబాయి

నా వయస్సు 25 సం॥లు. వివాహమై 2 సం॥లు అయింది. సంతానం కలుగలేదు. బాల్యం నుంచి నా అండకోశంలో అండాలు లేవు. నాకు సంతానం కలుగదని చెప్పినారు. ఇది నిజమా ? సంతానం కలగాలంటే ఏమి చేయాలి ?

★ మామూలు వారికన్నా మామూలు స్థానంలో ''అండాలు'' లేని వారికి పిల్లలు కలిగే అవకాశం తక్కువ. మామూలు చోటులో ఉష్ణోగ్రత తక్కువగా ఉండటం దీనికి కారణం. కొందరికి శస్త్ర చికిత్స ద్వారా ఈ అన్‌డిసెండెడ్ టెస్టిస్‌లను మామూలు స్థానానికి గాని, దరిదాపులకుగాని తెచ్చే వీలుంటుంది. శస్త్ర వైద్యులని సంప్రదించండి. ★

---

నిర్ణయమ్మీద పెళ్ళికి ముహూర్తంకూడా పెట్టారు. రేపు ముహూర్తమనగా ముందు రోజు అనుకోని సంఘటన జరిగిపోయింది.

ఇంకో అమ్మాయి అయితే ఎలా ప్రవర్తించేదో కాని సౌందర్య మాత్రం ధైర్యంగా నిలబడింది. తల్లిదండ్రులు ఆమె నిర్ణయాన్ని ఖండించారు. కాని సౌందర్య మనసు మార్చుకోలేదు ...

'ఏమిటా సంఘటన ?'ఆత్రంగా అడిగాను.

'సురేష్ కారుకు ఆక్సిడెంటయింది...'

'అతను చనిపోయాడా ?'

'నో... అతను బతికేవున్నాడు. కాని హి లాస్ట్ హిజ్ సైట్.' నా గుండెలో ఎవరో గునపాలతో పొడిచినట్లయింది.

'ఇందాక కార్లోవున్న కళ్ళద్దాల మనిషే సురేష్. సౌందర్య అతనికి చూపు రాదని తెల్సి కూడా పెళ్ళి చేసుకొంది. నౌ షి యీజ్ ప్రెగ్నెంట్, మెడికల్ చెకప్‌కోసం సుధ దగ్గరకు వచ్చింది...'

ఆ నవ్వే కళ్ళ వెనుక ఇంత విషాదగాథ దాగి

## నవ్వే కళ్లలో...?

వుందా ? కన్పించని నీలి నీడలున్నాయా ? నా మనసులో సంఘర్షణ ప్రారంభమైంది.

అంధుడైన భర్తను చేపట్టిన సౌందర్య వ్యక్తిత్వం నా కళ్లముందు హిమాలయాల్లా పెరిగిపోయింది.

ప్రేమించి పెళ్ళి చేసుకొని ఓ చిన్న కారణంగా భార్యతో బంధాలు తెంచుకోటానికి ప్రయత్నిస్తున్న నా వ్యక్తిత్వం తరిగిపోయి ఓ ఇసుక రేణువులా మారింది.

నామీద నాకే అసహ్యం కల్గింది. ఇకనైనా నా తప్పును సరిదిద్దుకోవాలి. అన్నపూర్ణకు అన్యాయం జరక్కూడదు ! లేచి నిలబడ్డాను.

'మిస్టర్ మధూ ! వెళ్దాం పద !' అంటూ అతన్ని కారు దగ్గరకు తీసుకువచ్చాను.

'అప్పుడేనా ? సుధ ఇంకా పేషెంట్స్‌తో బిజీగానే వుంటుంది ఆనంద్ !' అన్నాడు మధు వాచీ చూస్తూ,

'మీ ఇంటిక్కాదు ... '

'మరెక్కడికి ?' అంటూ కారెక్కాడు మధు.

'అన్నపూర్ణవాళ్లింటికి !' సిగ్గుపడుతూ చెప్పాను.

మధు కళ్లల్లో ఆనందం ఉప్పొంగింది. షేక్‌హ్యాండ్ యిచ్చాడు.

'వెరీగుడ్ ! థాంక్యూ మేన్ !' అంటూ కారు స్టార్ట్ చేశాడు మధు.

సౌందర్య నాకు కన్పించిన క్షణం ఎలాంటిదో కాని ఆమె కథ ఓ వెలుగు కిరణమై నా మనసులోని చీకట్లను పారద్రోలింది.

కదుల్తున్న కార్లోంచి శూన్యంలోకి చూశాను.

ఎదురుగా సౌందర్యే కన్పించినట్లయింది.

ఆమె కళ్ళు నవ్వుతూనే వున్నాయి !

అయితే ఆ నవ్వే కళ్లల్లో ...

నా కిప్పుడు కన్పిస్తున్నవేమిటి ?

నీలినీడలు కావు !

నీతి కిరణాలు ... ●